క్లుప్తంగా

నేటి నుంచి మద్యం దుకాణాలు బంద్

సీఐ లక్ష్మణ్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల వరకు హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు మూసివేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసినట్లు సీఐ లక్ష్మణ్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు తెరిచినా, అక్రమంగా మద్యం విక్రయాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో తమ సిబ్బందితో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

నిర్భయంగా ఓటేయండి

ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్



కవాతు నిర్వహిస్తున్న పోలీసు, మిలటరీ బలగాలు

కడ్తాల్: ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కడ్తాల్ ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ అన్నారు. సోమవారం కడ్తాల్, మైసిగండిలో మిలటరీ, రిజర్వ్‌డ్ పోలీసు బలగాలతో కలిసి ఆయన కవాతు నిర్వహించారు. జాతీయ రహదారితో పాటు ప్రధాన వీధుల గుండా కవాతు కొనసాగింది. అనంతరం ఎస్‌హెచ్‌ఓ శివప్రసాద్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బుగ్గ జాతర



ఆలయంలో భక్తుల సందడి

మంచాల: మంచాల మండల పరిధిలోని ఆరుట్లలో శ్రీ బుగ్గరామ లింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 15 రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించే ఈ జాతర ఉత్సవాలకు స్థానిక సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటిరోజు కావడంతో భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. సెలయేరులో పుణ్యస్నానాలు చేసి శివపార్వతులకు ఘనంగా పూజలు నిర్వహించడమే గాకుండా కార్తీక దీపారాధన చేశారు.

మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కల్యాణ్‌రెడ్డి

హుడాకాంప్లెక్స్: మహేశ్వరం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి సబితారెడ్డిని గెలిపించాలని నాయకులు జహీర్, ఇస్మాయిల్ ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్‌లో మైనార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి యువ నాయకుడు పట్లోళ్ల కల్యాణ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, సరూర్‌నగర్‌లో శ్మశాన వాటికతో పాటు మజీద్ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేశారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి మురళీధర్‌రెడ్డి, నాయకులు బాలకిషన్, మహేందర్‌యాదవ్, దయాకర్‌రెడ్డి, సాదిక్, సలీం, జహంగీర్, రజాక్, హైదర్, ఇర్ఫాన్, మహబూబ్, హఫీజ్, అజార్, నిజాం, సికిందర్ పాల్గొన్నారు.

ఓటు అమ్ముకుంటే భవిష్యత్తు అధోగతే

జైభారత్ రాష్ట్ర కార్యదర్శి రాజు

మహేశ్వరం: నోటుకు ఓటు అమ్ముకుంటే ఐదేళ్ల భవిష్యత్తు అధోగతే అని జైభారత్ రాష్ట్ర కార్యదర్శి సప్పిడి రాజు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జైభారత్ ఆధ్వర్యంలో ఓటును అమ్ముకుంటే శవంతో సమానమని వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాజకీయ నాయకులు చూపే డబ్బుల ఎరకు ఆశపడితే ఐదేళ్ల పాటు అంధకారమే అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా పోటీ చేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సామర్థ్యం గుర్తించి ఎన్నుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో గెలుపు కోసం కోట్లకు కోట్ల డబ్బుని ఎరగా వేస్తుంటే సామాన్యులు పోటీ చేసే పరిస్థితి లేదన్నారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మార్చొద్దన్నారు. అభ్యర్థి మన ప్రాంతానికి ఏం చేస్తాడు, మన భవిష్యత్‌కు వంటివి చూసి ఓటేయాలన్నారు.



తలకొండపల్లి: ప్రచార సభలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి

కాంగ్రెస్‌తోనే కల్వకుర్తి అభివృద్ధి

- పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి
- గ్రామాల్లో ఇంటింటి ప్రచారం

ఆమనగల్లు/తలకొండపల్లి/కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందన్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య, వార్డు సభ్యులు జలంధర్‌రెడ్డి, దాదాపు 100 మంది నాయకులతో కలిసి కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, టీపీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు అంజయ్యగుప్తా, రవీందర్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, యాదయ్యగౌడ్, వెంకటయ్య, శ్రీనివాస్, రమేష్, కృష్ణ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజల ఆశీర్వాదంతో కసిరెడ్డి నారాయణరెడ్డి విజయ ఢంకా మోగిస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డికి మద్దతుగా సోమవారం కడ్తాల్ మండల కేంద్రంలోని పలు కాలనీల్లో వారు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, చందోజీ, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

పద్మశాలీయుల సమస్యలు పరిష్కరిస్తాం

పద్మశాలీయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో సోమవారం పద్మశాలీయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కసిరెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అర్జున్‌రెడ్డి హాజరయ్యారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. ఆమనగల్లులో ఉన్న చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి, వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు అందించడానికి కృషిచేస్తానని చెప్పారు. స్థానిక పట్టణంలోని భక్త మార్కండేయస్వామి దేవాలయం అభివృద్ధికి సహకరిస్తానని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీసంఘం నాయకులు కేశవులు, శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, శివలింగం, సత్యం, ప్రసాద్, గిరి తదితరులు పాల్గొన్నారు.

మల్‌రెడ్డిని అసెంబ్లీకి పంపుదాం



చింతుల్లలో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం

- హస్తం నేతల ఇంటింటి ప్రచారం

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం మల్‌రెడ్డి రంగారెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చింతుల్లలో ఎంపీటీసీ సభ్యురాలు భారతమ్మ, రాజయ్యగౌడ్, కష్ణయ్య తదితరులు పర్యటించి చేతి గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మాల్‌లో గ్రామ సర్పంచ్ పడకంటి కవిత ఆధ్వర్యంలో మల్‌రెడ్డికి మద్దతుగా భారీ ర్యాలీ తీశారు. యాచారంలో భాస్కర్, సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో, గునుగల్‌లో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రామకష్ణ తదితరుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చేతిగుర్తుపై ఓటేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

రాందాస్‌పల్లిలో..

ఇబ్రహీంపట్నం రూరల్: అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తిక, రాందాస్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఓటర్లను కోరారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని రాందాస్‌పల్లిలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్‌గౌడ్, రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాలి

- కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి

ఆమనగల్లు: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లిలో సోమవారం ఆచారి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రజల సక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రెండుసార్లు తప్పుడు హామీలు ఇచ్చి మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను నమ్మి మోసపోవద్దని ఆయన ఓటర్లను కోరారు. ఐదుసార్లు ఓడిపోయిన తనకు ఈసారి ప్రజలు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే.. కల్వకుర్తి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి తనని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరిప్రసాద్, వెంకటయ్య, రవి, భాస్కర్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం రథంపై మాట్లాడుతున్న ఆచారి

అవకాశం ఇవ్వండి.. మీ బిడ్డలా పనిచేస్తా



బీజేపీలో చేరిన దబిల్‌గూడ నాయకులు

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్

కందుకూరు: తనను గెలిపిస్తే అందరి సంక్షేమానికి మీ కొడుకులా పని చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని 11 గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో కొత్తగా పింఛన్లు, రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే ఒకే ఇంట్లో ఇద్దరికి పింఛన్లు ఇస్తామని, అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, జ్యోతిపాండు, అశోక్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

మహేశ్వరం: కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక గూటి పక్షులని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని డబిల్‌గూడ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు. స్థానికుడు, బీసీ బిడ్డను ఆదరించాలన్నారు. బీజేపీతోనే సుస్థిర, సుపరిపాలన కొనసాగుతుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాపయ్యగౌడ్, యాదీష్, మాధవచారి, శంకర్, నందీశ్వర్, ఉపేందర్, భరత్, ఓం ప్రకాష్, వెంకటేష్ గౌడ్, మధు, శ్రీశైలం, గణేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, సాయిరామ్‌గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలు నిర్మిస్తాం

- కాంగ్రెస్ ఎల్బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గూడు లేని పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్‌లో భూపేష్ గుప్తానగర్, నందనవనం కాలనీలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రాంతంలోని నిర్వాసితులకు ఇళ్ల పట్టాలతో పాటు అర్హులకు రేషన్‌కార్డులు ఇస్తామన్నారు.

నాగోలు డివిజన్‌లో...

నాగోల్ డివిజన్‌లోని ఎన్విరాన్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన సమావేశంలో మధుయాష్కీ గౌడ్ పాల్గొన్నారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శైలజారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భూపేశ్‌గుప్తానగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మధుయాష్కీ గౌడ్

రోషన్‌దౌలా బస్తీలో..

కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ రోషన్ దౌలా బస్తీలో సోమవారం కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను బస్తీ వాసులకు వివరించారు. నాయకులు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సామ రాంమోహన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మాళి, సంజీవ, శివ పాల్గొన్నారు.

నేటితో ప్రచార పర్వానికి తెర

సాయంత్రం 5 గంటల నుంచి మూగబోనున్న మైక్‌లు, సౌండ్ రికార్డులు

ఇబ్రహీంపట్నం: దాదాపు రెండు నెలలుగా జరిగిన శాసనసభ ఎన్నికల ప్రచార ఘట్టానికి మంగళవారం సాయంత్రం 5 గంటలకు తెర పడనుంది. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం పార్టీల శ్రేణులు, అభ్యర్థులు, నియోజకవర్గంలో ఊపిరిసలపకుండా ప్రచారాన్ని చేపట్టారు. గల్లీగల్లీ, ఇంటింటి ప్రచారం, బైక్ ర్యాలీలు, సభలు, సమావేశాల్లో ఆయా పార్టీల శ్రేణులు మునిగితేలారు. ఇప్పుడు ఎన్నికల ఘట్టం చరమాంకానికి చేరుకుంది. 30న జరిగే పోలింగ్‌కు మిగిలిన ఈ తక్కువ సమయంలో ఏ విధంగా ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలనే ఆలోచనల్లో ఆయా పార్టీ శ్రేణులు ఉన్నారు.

హోరాహోరీ ప్రచారం..

వివిధ పార్టీల అగ్రనేతల హోరాహోరీ ప్రచారాలతో సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలో రాజకీయాలు వేడెక్కాయి. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని ప్రముఖ సినీనటి విజయశాంతి ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేయగా, బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ తరుపున అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రోడ్డుషో నిర్వహించారు. సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యను గెలిపించాలని మండలంలోని పొల్కంపల్లి, దండుమైలారం గ్రామాల్లో త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ప్రచారం చేశారు. దీంతో పార్టీ కార్యకర్తలు, సమీకరించిన జనాలు, ర్యాలీలు, మైక్ సౌండ్ రికార్డులు, ఉపన్యాసాలతో పట్నం దద్దరిల్లింది. ప్రచార నేపథ్యంలో పట్నంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే నేటి సాయంత్రంతో అంతా మూగబోనుంది.

కార్యకర్తలకు సముచిత స్థానం

బీఆర్‌ఎస్ యువనేత కార్తీక్‌రెడ్డి

తుక్కుగూడ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆపార్టీ యువజన రాష్ట్ర నాయకుడు పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్‌నగర్‌కాలనీకి చెందిన యువకులు బోధ జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు పార్టీలో చేరిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

కందుకూరు: మండల పరిధిలోని జైత్వారంలో మంత్రి సబితారెడ్డి తనయుడు కౌశిక్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, సర్పంచ్ సదాలక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ సురేష్, జగన్‌మోహన్‌రెడ్డి, రాజు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, శ్రీశైలం, పర్వతాలు, శేఖర్ రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, శంకర్, వెంకట్‌రెడ్డి, విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఇబ్రహీంపట్నం అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రచారంలో భాగంగా ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టానని అన్నారు. ఎంకేఆర్ ఫౌండేషన్ ద్వారా వందల మంది నిరుద్యోగులకు కోచింగ్ ఇప్పించి ఉద్యోగులుగా తీర్చిదిద్దానన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తిచేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్, బాటసింగారం సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు స్వరూప, మల్లేశ్, కిరణ్‌కుమార్‌గౌడ్, ఎంపీటీసీలు గ్యార బాలలింగస్వామి, వెంకటేష్, చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మరోసారి విజయ ఢంకా మోగిస్తారని కౌన్సిలర్ సుజాత ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని వివిధ వార్డుల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచిరెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్‌షోలో మాట్లాడుతున్న మంచిరెడ్డి

రాగన్నగూడలో..

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని సోమవారం మున్సిపాలిటీలోని రాగన్నగూడలో మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కారు గుర్తుకు ఓటువేసి మంచిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. నాయకులు సురేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్: రాగన్నగూడలో బీఆర్‌ఎస్ నేతల ప్రచారం

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి

ఆమనగల్లు: మతం, కులం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.సమావేశంలో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ప్రతిఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వలేదని, అనేకసార్లు పెట్రోలు, డీజిల్ ధరలను పెంచిందని, ఎల్‌పీజీ సిలిండర్ ధరలను కూడా పెంచిందని మండిపడ్డారు. ఇటు రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు పట్టించుకోవడం లేదని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీల మాయమాటలను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కానుగుల వెంకటయ్య, ఆంజనేయులు, యాదయ్య, మల్లేశ్, పెంటయ్య, శివశంకర్, చెన్నయ్య, నర్సింహ, రమేశ్, రాములమ్మ, గున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కమ్యూనిస్టులతోనే మార్పు సాధ్యం



ప్రచార సభలో మాట్లాడుతున్న మాణిక్ సర్కార్

- త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్
- ఆరుట్లలో ఎన్నికల ప్రచారం

మంచాల: రాష్ట్రంలో, దేశంలో మార్పు రావాలంటే కచ్చితంగా కమ్యూనిస్టులు అధికారంలోకి రావాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అన్నారు. సోమవారం మంచాల మండలంలోని ఆరుట్లలో నిర్వహించిన సీపీఎం ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడి నిలబడే పార్టీ సీపీఎం అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. ధరల పెరుగుదలతో పేదలు బతకడం కష్టంగా మారిందన్నారు. ప్రజలను ప్రలోభపెట్టి, మోసం చేసి అధికారంలోకి రావాలని నేడు బడా పార్టీల నాయకులు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. వారి కుట్రలను తిప్పికొట్టి కమ్యునిస్టు పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రాంతంలో సీపీఎం చరిత్ర తెలిసిన వారందరూ కూడా పగడాల యాదయ్య గెలుపు కోసం సుత్తి–కొడవలి–నక్షత్రం గుర్తుపై ఓటువేసి ఆయనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు భూపాల్, జంగారెడ్డి, సైకిలాబ్ బాబు, జిల్లా కార్యదర్శి భాస్కర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి

ఇబ్రహీంపట్నం: కార్తీక పౌర్ణమి వేడుకలను సోమవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి రోజున శివకేశవాలయాల్లో దీపాలు వెలిగిస్తే ఎంతో పుణ్యఫలాన్ని పొందుతారనే నమ్మకం. ఇబ్రహీంపట్నంలో శ్రీ వీరభద్ర ఆలయం, నాగలింగేశ్వర, శ్రీలక్ష్మీనృసింహ ఆలయాల్లో మహిళలు దీపాలను వెలిగించి భక్తి చాటారు. ఎప్పటి మాదరిగానే పెద్దచెరువుకు గంగమ్మ అఖండజ్యోతి హారతినిచ్చారు. ఈహారతిని రాచకొండలోని శివాలయం వరకు తీసుకెళ్లారు.



వీరభద్రస్వామి ఆలయంలో..

సల్లంగ చూడమ్మ.. మైసమ్మ

- ప్రారంభమైన మైసిగండి జాతర
- కిటకిటలాడిన ఆలయం

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండిలో కొలువైన మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమికి ప్రారంభమయ్యే మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలు.. ఈ ఏడాది కూడా కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు అమ్మవారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత, భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, వెంకటేశ్, లింగప్ప, జగదీశ్, సర్వేశ్వర్, ఈశ్వరప్ప, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులకు మంగళ హారతి ఇస్తున్న పూజారి



మైసమ్మ తల్లికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు